95 NEWS ప్రతిక్షణం ప్రజాక్షేమం కోసం
ఎలక్ట్రానిక్ మీడియా
తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్

# 95 న్యూస్ పేపర్

ఎడిటర్ :ఎస్ కె. సిరాజుల్

సంపుటి 02 సంచిక 323

గురువారం జనవరి 29, 2026 పేజీలు 8 వెల-5





## మున్సిపల్ ఎన్నికల్లోనూ
# సత్తా చాటుతాం

### పార్టీ పనితీరు, గెలుపు అవకాశాలు లక్ష్యంగా ఎంపిక

- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక
- మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ సీరియస్‌గానే తీసుకుంది
- సిఎం లేనప్పుడు మంత్రులు తనను కలవడంలో తప్పులేదు
- దీనిపై అసత్య కథనాలు రాయడం సరికాదు
- మిడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం,జనవరి28 :**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక అనేది కేవలం ఒకరిద్దరి నిర్ణయం కాకూడదని, అత్యంత పారదర్శకంగా , సమిష్టిగా సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆయా మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , సీనియర్ నాయకులు అందరూ కలిసి చర్చించి, ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఖరారు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో మీడియాతో మాట్లాడిన భట్టి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ మున్సిపల్ ఎన్నికలను సీరియస్ గా తీసుకొని పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు.అభ్యర్థుల ఎంపికలో అందరినీ కలుపుకుని పోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేధాలు రాకుండా ఉంటాయని, ఇది ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పార్టీ మండల , పట్టణ స్థాయి నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఈ పక్రియను విజయవంతం చేయాలని శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు.



అభ్యర్థుల ఎంపికకు సంబంధించి భట్టి విక్రమార్క కొన్ని కీలక మార్గదర్శకాలను విడుదల చేశారు. కేవలం రాజకీయ ప్రాధాన్యతలకు కాకుండా, క్షేత్రస్థాయిలో గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఆదేశించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వారు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే అభ్యర్థులపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న 'ఆరు గ్యారెంటీలు' , ఇతర అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించి, వారి మద్దతు పొందే నాయకులను గుర్తించడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలమని ఆయన పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్ల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో అభ్యర్థుల ఖరారు పక్రియను వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , మున్సిపాలిటీ బాధ్యులు తదేక దృష్టితో పనిచేసి, ఫిబ్రవరి 13న వెలువడే ఫలితాల్లో పార్టీ జెండా ఎగిరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మిగతాద్ది 2 లో

## వికసిత్ భారత్ వైపు
# దేశం పయనిస్తోంది

- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం
- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి
- జిఎస్‌టి శ్లాబుల తగ్గింపుతో పెరిగిన కొనుగోలు శక్తి
- పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతున్న భారత్
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



**న్యూఢిల్లీ,జనవరి28 :**
దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ...వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉందని రాష్ట్రపతి వెల్లడించారు.దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది. జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది.

02



## ఫిరాయింపుల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్

**హైదరాబాద్:**
తెలంగాణ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. పెండింగ్?లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒకరైన.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీన తన ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఆయన పేర్కొన్నారు.
కారు గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

2 లో



## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**తెలంగాణ భవన్:**
వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సొంత గూటికి చేరారు. కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో కార్యకర్తల సమక్షంలో కేటీఆర్ బీఆర్ఎస్ కండువా కప్పి ఆరూరిని పార్టీలోకి ఆహ్వానించారు.

## మాహారాష్ట్ర రాజకీయాల్లో
# తీరని విషాదం

- విమాన ప్రమాదంతో డిప్యూటి సిఎం అజిత్ పవార్ దుర్మరణం
- పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు మృతి



**ముంబై,జనవరి 28 :**
మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు.

మిగతాద్ది 2 లో



## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు
## మొత్తం 35 అంశాలపై చర్చ

- పిపిపి మోడల్‌లో పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ
- టిడ్కోకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల రుణ గ్యారెంటీ
- అర్జున అవార్డు గ్రహీత జ్యోతికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం
- డిగ్రీ తర్వాత జ్యోతికి గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం
- టీటీడీ నెయ్యి కల్తీకి సంబంధించిన సిట్ నివేదికపై మంత్రివర్గంలో చర్చ
- అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్లు
- అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్

**అమరావతి,జనవరి 28**
ఏపీ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం సందర్భంగా 35 ఎజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

2లో..



## రాష్ట్రంలో మరో కుంభకోణాన్ని బయటపెడుతున్నా..

**హైదరాబాద్:**
రాష్ట్రంలో మరో అవినీతి కుంభకోణాన్ని బయటపెడుతున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్‌కు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. "110 దరఖాస్తుల్లో 25కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త అనుమతుల్లో ముఖ్య నేత కోటా 21, మంత్రి కోటా 4" అని హరీశ్ రావు ఆరోపించారు.

# మేడారం జాతరలో జనసందడి

- గద్దెలకు అమ్మవార్లు చేరుకునే సమయం ఆసన్నం
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

**ములుగు,జనవరి 28 :**
ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర మొదలయ్యింది. లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవారు మేడారం గద్దెపైకి రానున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ మందిరంలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



2లో

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి



**హైదరాబాద్:**
బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌కు విన్నవించారు. "నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదు. నేను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను.

02

# ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు మొత్తం 35 అంశాలపై చర్చ

మొదటిపేజీ తరువాయి

పీపీపీ పద్ధతిలో పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ అభివృద్ధికి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల ప్రభుత్వ రుణ గ్యారెంటీకి ఆమోదం తెలిపింది. టీటీడీ పరిధిలో పలు పోస్టుల అప్‌గ్రేడ్‌కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా సంస్థలతో పాటు.. అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్ కోసం భూమి కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అర్జున అవార్డు గ్రహీత జ్యోతికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం ఇచ్చేందుకు నిర్ణయించింది. డిగ్రీ తర్వాత జ్యోతికి గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక, టీటీడీ నెయ్యి కల్తీకి సంబంధించిన సిట్ నివేదికపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. సిట్ నివేదికపై వైసీపీ నేతల దుష్ప్రచారంపై ప్రధానంగా చర్చ జరిగింది. నెయ్యి కల్తీపై సిట్ నివేదిక తెప్పించాలని కేబినెట్ కోరింది. ఇప్పటికే సీబీఐ సిట్ చార్జ్‌షీట్ వేసిన విషయాన్ని అధికారులు కేబినెట్‌కు తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తితిదే లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీపై సిట్ ఇచ్చిన నివేదికపై కూడా మంత్రివర్గ భేటీలో చర్చ జరిగింది. సిట్ నివేదిక అధికారికంగా వచ్చిన తర్వాత.. దానిపై స్పందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు. ప్రధానంగా పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్వీ వర్సిటీ పరిధిలోని 33 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీపై చర్చించారు. పలమనేరులో లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు భూ బదిలీ ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చింది. అర్జున అవార్డు గ్రహీత జ్యోతికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం ఇచ్చేందుకు ఆమోదం. డిగ్రీ తర్వాత గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల ప్రభుత్వ రుణ గ్యారెంటీకి ఆమోదం ఇచ్చింది. అమరావతి పరిధిలోని వీధిపోటు భూములు పొందిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లకు ఆమోదం ఇచ్చారు. అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరుకు ఆమోదం ఇచ్చింది. తితిదే పరిధిలో పలు పోస్టుల అప్‌గ్రేడ్‌కు, పలు సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం ఇచ్చింది. అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్, థీమ్ పార్కు ఏర్పాటుకు భూకేటాయింపులకు ఆమోదం లభించింది. పలు జలవనరుల ప్రాజెక్టులకు ఆర్థిక అనుమతులకు ఆమోదం ఇచ్చారు. ఇంధనశాఖలో పలు పరిపాలన అనుమతులకు ఆమోదం ఇచచ్చింది. తిరుపతి, విశాఖపట్నం శిల్పారామం ప్రాజెక్టుల కోసం గార్డెన్‌సిటీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు జారీ చేసిన అనుమతులను రద్దు చేసి, కొత్తగా బిడ్‌లను ఆహ్వానించాలని మంత్రివర్గ నిర్ణయం పీపీపీ విధానంలో గుంటూరు శిల్పారామంలో సాంస్కృతిక కేంద్రం, వినోద జోన్ అభివృద్ధికి ఆమోదం ఇచ్చింది. ఇకపోతే నెయ్యి కల్తీపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంపై కేబినెట్ మీటింగ్ లో మంత్రులు పలు విషయాలను సీఎంకు వివరించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన బ్యాంకు అకౌంట్ లో రూ.4.50 కోట్లు జమ అయ్యాయని మంత్రులు అన్నారు. అధికారులు కూడా సీఎంకు పలు విషయాలను వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందనేది యదార్థమని అధికారులు తెలిపారు. కాంట్రాక్ట్ తీసుకున్న డెయిరీకి పాల సేకరణ సామర్థ్యం లేదని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో కల్తీ నెయ్యికి సంబంధించి మంత్రులు మరికొన్ని విషయాలను సీఎం వద్ద ప్రస్తావించారు. కాంట్రాక్ట్ తీసుకున్న డెయిరీలు కొన్ని రసాయనాలు మిశ్రమం ఉపయోగించి నెయ్యి తయారు చేశారని మంత్రులు వెల్లడించారు. వైసీపీ హయాంలో తప్పు చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద నెట్టే ప్రయత్నం చేశారని మంత్రులు అన్నారు. సిట్ నివేదిక వచ్చిన తరువాత మాట్లాడుదామని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. వైసీపీ నేరప్రవృత్తి అలానే ఉంటుందని, కోడి కత్తి, బాబాయి గొడ్డలి, గులక రాయి కేసులు ఎలా చేశారో మీరు చూశారు కదా? అని సీఎం అన్నారు.

# మేడారం జాతరలో జనసందడి

మొదటిపేజీ తరువాయి

అనంతరం భారీ భద్రత మధ్య సారలమ్మ గద్దెకు చేరుకుంటారు. గోవింద రాజు, పగిడిద్ద రాజులు కూడా గద్దెలకు చేరుకుంటారు. అలాగే గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు గద్దెపైకి వస్తారు. సమ్మక్క రాకతో జాతర పరిపూర్ణం కానుంది. మరుసటి రోజు అనగా శుక్రవారం(జనవరి 30) భక్తులు సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజైన శనివారంసాయంత్రం సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు వన ప్రవేశం చేస్తారు. దీంతో జాతర పరిపూర్ణంగా ముగుస్తుంది. మేడారం మహా జాతర తెలంగాణ సంస్కృతి, గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. జనాల గుడారాలతో మేడారం కిటకిటలాడుతోంది. భక్తులు బెల్లం(బంగారం) సమర్పిస్తూ ఆచారాలు పాటిస్తున్నారు. మహాజాతరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రభుత్వం తాజాగా గద్దెలను పునర్నిర్మాణం చేసింది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, నీరు, వైద్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు.మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రారంభం కావడంతో ములుగు జిల్లాలోని అడవులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండగగా పేరొందిన ఈ జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం. సారలమ్మ గద్దెపైకి వస్తున్న తరుణంలో వేలాది మంది భక్తులు జంపన్న వాగు వద్దకు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరూ బస్సుల ద్వారా, సొంత వాహనాల ద్వారా నేరుగా వాగు వద్దకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం వచ్చే ప్రతి భక్తుడు ముందుగా జంపన్న వాగును సందర్శించడం ఒక ఆచారంగా వస్తోంది. ఇక్కడ పుణ్యస్నానం ఆచరించిన తర్వాతే అమ్మవార్ల గద్దెల దర్శనానికి వెళ్లడం సంప్రదాయం. భక్తులు తమ వెంట తెచ్చుకున్న అమ్మవారి ప్రతిమలను వాగులో పవిత్రంగా కడిగి, పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇళ్ల వద్ద ప్రతిష్ఠించుకున్న గద్దెలను మేడారం తీసుకువచ్చి, ఇక్కడ జంపన్నకు మొక్కులు అప్పగిస్తారు. తాము కోరుకున్న కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా 'ఎత్తు బంగారం' అంటే తమ బరువుకు సమానమైన బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించేందుకు సిద్ధమవుతారు. ముఖ్యంగా అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన వెదురు లంకలను (ఎదురు కర్రలు) పట్టుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు చేసే సందడి జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ విజయాలను ఆయుధంగా మలచుకుని, ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులను ఆయన ఉత్సాహపరిచారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలు గెలిచి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామన్నారు.. నగరాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

÷ఎన్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు భట్టి. తమ కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుంది.. రాష్ట్ర భవిష్యత్తే తమ లక్ష్యమని అన్నారు. ప్యూర్, క్యూర్, రేర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తనకు కొన్ని సూచనలు చేశారని చెప్పారు. మంత్రులు తెలియజేసిన సమస్యలను తాను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పారు. ప్రజాభవన్లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి భ్రమల్లో ఉండి పిచ్చి రాతలు రాస్తున్నారని ఫైర్ అయ్యారు భట్టి. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే ఇంకెవరిని కలుస్తారని ప్రశ్నించారు భట్టి. సిఎం లేనప్పుడు ప్రధాన సమస్యలను చర్చించేందుకు తనతో కలిసినట్లు వెల్లడించారు.

ప్రజాభవన్ లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి రాతలు రాస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ÷ర్ అయ్యా రు. సీఎం రేవంత్ దేశంలో లేనందున మున్సిపల్ ఎన్నికలపై తనకు కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మంత్రులు వారి సమస్యలు తెలియజేశారని ఆ విషయాలను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పారు. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే రాసే వారితో చూపించే వారితో కలుస్తారా? అని ప్రశ్నించారు. తమ క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర భవిష్యత్తు తమ అందరి ఆలోచన లక్ష్యం అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని.. బల్దియాల్లోనూ అత్యధిక స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

'మున్సిపల్ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశాన్ని ప్రజాభవంలో చర్చించాం.నిజామాబాద్ పార్లమెంట్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొన్నిచోట్ల సమస్య ఎదురైనందున అందుకు సంబంధించిన మంత్రులు నాతో సమావేశం అయ్యారు. ప్రజాధరణ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా సేవ చేయాలని కోరుకునేవారు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువమంది మున్సిప ల్ టికెట్లను ఆశిస్తారు అందులో తప్పులే దు. ఆ జిల్లా ఇన్చార్జి మంత్రులు స్థానిక శా సనసభ్యులు సమష్టిగా నిర్ణయం తీసుకొని గెలుపు అవకాశాలు ఉన్న వారికి టికెట్లు కేటాయిస్తరు. సింగరేణి టెండర్ల అంశంలో పూర్తి ఆధారాలతో స్పష్టత ఇచ్చాను. ఇంకా అందులోనే తిరుగుతాను అంటే వాళ్ల కర్మ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశాం. రేర్, క్యూర్ ప్యూర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభి వృద్ధి కోసం గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశాం' అని తెలిపారు.

# దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్

**రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు**

**రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం**

**క్షేత్రస్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు**

**రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,జనవరి28 :** ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ౧÷ర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక/ సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ?విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.

విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల 2024 సంవత్సరంలో నా పాలేరు నియోజవకర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేక పోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ అందుబాటు లో ఉంది. వ్యవస్టను క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నగరంలో హైరైజ్డ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాధ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

మొదటిపేజీ తరువాయి

నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు అందించాం. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు.అంతకుముందు పార్లమెంట్‌కు చేరిన రాష్ట్రపతికి స్పీకర్ ఓం బిర్లా, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా పార్లమెంట్ భవనంలోకి తోడ్కొని వెళ్లారు.

# మాహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

మొదటిపేజీ తరువాయి

అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

# ఫిరాయింపుల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్

మొదటిపేజీ తరువాయి

అయితే స్పీకర్ చర్యలకు తీసుకోవడం లేదంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో కోర్టు డెడ్‌లైన్ లు, వార్నింగ్ లతో స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ చేపట్టారు. ఇప్పటికే ఏడుగురిని విచారించిన స్పీకర్?.. వాళ్లు పార్టీ మారినట్లు ఆధారాల్లేవంటూ పిటిషన్లు కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు. అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు క్లీన్ చిట్ ఇచ్చారు.

ఈ క్రమంలో మిగిలిన ముగ్గురు డాక్టర్ సంజయ్, దానం నాగేందర్ , కడియం శ్రీహరిలను విచారణ జరపాల్సి ఉంది. అయితే హఠాత్తుగా ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తాజాగా నోటీసులు ఇచ్చారు. అలాగే దానం నాగేందర్ పై అనర్హత పిటిషన్ వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సైతం స్పీకర్ నోటీసులు ఇచ్చారు. వీరిద్దరు ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని వేర్వేరుగా ఇచ్చిన నోటీసులలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో చేస్తున్న జాప్యంపై ఈనెల 19వ తేదిన స్పీకర్ కు సుప్రీంకోర్టు కోర్టు ధిక్కర నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు ఇవ్వడం ఆసక్తిగా మారింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేయడం తెలిసిందే.

# అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి

మొదటిపేజీ తరువాయి

ఆ సమావేశానికి వ్యక్తిగత హోదాలో వెళ్లాను. మీడియా కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నాను. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి ఆ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దు" అని దానం నాగేందర్ కోరారు. ఈ నెల 30న విచారణకు రావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

మొదటిపేజీ తరువాయి

గత సోమవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన రమేష్?.. బీఆర్ఎస్ అధిష్టానం ఆహ్వానం మేరకు త్వరలోనే పలువురు నాయకులు, అనుచరులు, అభిమానులతో కలిసి గులాబీ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. చెప్పినట్లుగా ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల వేళ అరూరి రమేశ్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరనుండటంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

2024, మార్చిలో బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన రమేష్ అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత రాజకీయంగా ఆశించిన స్థాయి ప్రాధాన్యం లభించకపోవటం, పార్టీలో క్రియాశీలక ప్రాధాన్యం తగ్గిపోవడం ఆయన అసంతృప్తికి కారణమైనట్టు తెలుస్తోంది.

## నేను బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు

తెలంగాణలో బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై, ఆయన స్పీకర్ కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను దానం నాగేందర్ ఘాటుగా ఖండిస్తూ, ఆ పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌ను కోరారు. అఫిడవిట్‌లో దానం నాగేందర్ తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, అలాగే పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు సమాచారమూ అధికారికంగా తనకు అందలేదని స్పష్టం చేశారు. మార్చి 2024లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది పూర్తిగా వ్యక్తిగత హోదాలో జరిగినదేనని చెప్పారు. ఒక పార్టీ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరవడమే ఫిరాయింపుగా పరిగణించడాన్ని ఆయన తప్పుబట్టారు.

# ఎన్ఐఐఎంహెచ్‌లో పరంపర వైద్య ప్రతినిధులకు అపూర్వ స్వాగతం

**"దేశవ్యాప్త ఆయుర్వేద అధికారుల సమక్షంలో సంఘం నేతలకు గుర్తింపు కరతాల ధ్వనులతో అభినందించిన శాస్త్రవేత్తలు- అరుదైన గ్రంథాలయం సందర్శన ఫిబ్రవరి 1న జరిగే వనమూలికా సదస్సుకు ఎన్ఐఐఎంహెచ్ ప్రతినిధులకు ఆహ్వానం"**

హైదరాబాద్(95 న్యూస్)
భారతీయ వైద్య విజ్ఞానాన్ని భద్రపరుస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంస్థ 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్' (ఎన్ఐఐఎంహెచ్) వేదికగా బుధవారం ఒక అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది. ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణ స్వామి, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి రఫీయుద్దీన్ తమ బృందంతో కలిసి గడ్డిఅన్నారంలోని ఎన్ఐఐఎంహెచ్ కార్యాలయాన్ని సందర్శించారు.





దేశవ్యాప్త అధికారుల సమక్షంలో ప్రత్యేక గుర్తింపు ఈ సందర్శన సమయంలో ఎన్ఐఐఎంహెచ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆయుర్వేద అధికారులు, పరిశోధకుల ప్రత్యేక సమావేశం జరుగుతోంది. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు సింహాచలం లక్ష్మణ స్వామిని, ఎండి రఫీయుద్దీన్‌ను సభకు పరిచయం చేశారు. క్షేత్రస్థాయిలో అరుదైన మొక్కలను రక్షిస్తూ, పరంపర వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్న ఈ రెండు సంఘాల కృషిని అధికారులు ప్రత్యేకంగా వివరించారు. దీనికి స్పందించిన దేశవ్యాప్త ఆయుర్వేద అధికారులు, శాస్త్రవేత్తలు కరతాల ధ్వనులతో (చప్పట్లతో) ఇరువురు నేతలకు ఘనంగా స్వాగతం పలికి అభినందించారు.

**ఆధునిక వైద్యానికి సాంప్రదాయ వైద్యం తోడైతే అద్భుతాలే..**
సంప్రదాయ వైద్యం, ఆధునిక పరిశోధన ఒకే వేదికపై కలిసిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. అపురూప గ్రంథాలయ సందర్శన అనంతరం ఎన్ఐఐఎంహెచ్‌లోని ప్రసిద్ధ గ్రంథాలయాన్ని ప్రతినిధి బృందం సందర్శించింది. ఆయుర్వేద చరిత్రకు సాక్ష్యంగా నిలిచే అపారమైన గ్రంథాలను, అరుదైన వైద్య పుస్తకాలను అక్కడ భద్రపరిచిన తీరును వారు పరిశీలించారు. భారతీయ వైద్య వారసత్వానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గుర్తింపు తెచ్చేలా ఎన్ఐఐఎంహెచ్ చేస్తున్న కృషి అనన్య సామాన్యమని, ఇక్కడి వనరులు ఆయుర్వేద రంగానికి వెలకట్టలేని సంపద అని సింహాచలం లక్ష్మణ స్వామి కొనియాడారు. హెర్బల్ గార్డెన్ సదస్సుకు ఆహ్వానం వచ్చే ఆదివారం, ఫిబ్రవరి 1, 2026న నగర శివార్లలోని హెర్బల్ గార్డెన్‌లో నిర్వహించతలపెట్టిన 'ఆయుర్వేద వనమూలికా అవగాహన సదస్సు'కు ఎన్ఐఐఎంహెచ్ శాస్త్రవేత్తలను, అధికారులను ముఖ్య అతిథులుగా హాజరుకావాలని కోరుతూ సంఘం నాయకులు అధికారికంగా ఆహ్వానించారు. పరంపర వైద్యుల అనుభవానికి, సంస్థ శాస్త్రీయత తోడైతే అద్భుతాలు సాధించవచ్చని, తమ సదస్సుకు వచ్చి మార్గనిర్దేశం చేయాలని వారు కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు.

**కొత్త అధ్యాయానికి నాంది..**
ఈ భేటీ అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్ఐఐఎంహెచ్ వంటి ఉన్నత స్థాయి పరిశోధన సంస్థ తమ పనిని గుర్తించి గౌరవించడం పరంపర వైద్యులందరికీ దక్కిన గౌరవమని పేర్కొన్నారు. వైద్య చరిత్రను కాపాడటంలో, పరిశోధనల్లో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండు సంఘాల కార్యవర్గ సభ్యులు, వైద్యులు, ఎన్ఐఐఎంహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన దిర్సంపల్లి గ్రామ సర్పంచ్



95న్యూస్ దోమ:
దోమ మండలం దిర్సంపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ విజయలక్ష్మి వెంకట్ రాములు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అధికార పార్టీలో ఉంటేనే గ్రామాభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పరిగి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై విశ్వాసంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు విజయలక్ష్మి వెంకట్ రాములు తెలిపారు.

## ఈరోజు చేగుంట మండలం పొలం పల్లి గ్రామంలో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి అధ్యక్షత గ్రామసభ.



95న్యూస్ చేగుంట ప్రతినిధి జనవరి 28
గ్రామాల్లో ప్రజల ఆలోచన మేరకు గ్రామ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు మొదటిగా రెడ్డిపల్లి వడ్డరి కాలనీ నుండి పొలంపల్లి పెద్ద చెరువు కట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణాల కోసం , మరియు గ్రామ అభివృద్ధి కోసం పలు గ్రామ సమస్యలపై తీర్మానం చేయడం జరిగింది గ్రామ సెక్రెటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల నుండి వచ్చిన సమస్యలను గ్రామసభ తీర్మానం చేయడం జరిగింది ఉప సర్పంచ్ సత్య గౌడ్, వార్డు సభ్యులు చింతకాయల ప్రవీణ్, మైలారం రాజు, గరిగే మంజుల, కొండికలమ్మ, యాట మౌనిక, శేఖర్ గౌడ్, గ్రామ ప్రజలు, మండల ఉన్నత అధికారులు వ్యవసాయ అధికారి మాధవి, మిషన్ భగీరథ ఏ ఈ,మహిళ సంఘాల సిసి శంకర్, జిపిఓ నరేందర్ రెడ్డి, ఫారెస్ట్ సైకాదర్ రవికుమార్, ఘా.వీ.చీ కర్ణం నాగమణి, అంగన్వాడి టీచర్ మమత, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సిహెచ్ఎం పక్షవాతం వికలాంగుల జిల్లా ఉన్నతాధికారి గ్రామ ప్రజలు మాజీ సర్పంచ్ కోండి మల్లేశం మరియు పులిమామిడి రాజు వెనేలి సత్యం మాజీ ఉప సర్పంచ్ దుర్గయ్యా మాజీ వర్డ్ సభ్యులు కోండి లక్మన్ దేవమ్మోల ఐలయ్య యాట సత్తయ్య పులిమామిడి చంద్రం యట చంద్రం టప భాస్కర్ టప భానుచందర్ కొండి రవి చింతకాయల నర్సింలు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు

## డి సి యచ్ యస్ కేసగాని రాజశేఖర్ గౌడ్ కు గోపా నాయకుల సన్మానం



వృత్తి ధర్మానికి నిలువుటద్దంగా నిలుస్తూ సామాజిక సేవ కార్యక్రమాల్లో "బేష్ "అనిపిస్తూ జిల్లా ప్రజారోగ్య సేవల్లో ప్రతిభ కనబరిచినందుకు జిల్లా ఉత్తమ జిల్లా వైద్యాధికారిగా కేసగాని రాజశేఖర్ గౌడ్ (ఐజను) ఎంపికై గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా ఉత్తమ జిల్లా వైద్యాధికారి అవార్డును అందుకున్న సందర్భంగా బుధవారం అయన ను గోపా జిల్లా ఉపాధ్యక్షులు తోడేటి దుర్గాప్రసాద్ గౌడ్, బెల్లంకొండ శరత్ గౌడ్, ఇ. సి మెంబర్ చేబ్రోలు ఇంద్రసేన గౌడ్, గోపా సభ్యులు కుక్కల నాగేశ్వరరావు గౌడ్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా.రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిరంతరం అందించిన సేవలకు గాను ఈ గుర్తింపు లభించడం సంతోషకరమని అయన తెలిపారు. ఈ అవార్డు మరింత నిబద్ధతతో మరిన్ని సేవలు అందించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారన్నారు.

## ఘనంగా సమ్మక్క సారలమ్మ జాతర

మహబూబాబాద్ జిల్లా
డోర్నకల్ మండలం కాస్నా తండా గ్రామంలో సమ్మక్క సారలమ్మ మీని జాతర అంగరంగ వైభవంగా మొదలైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు చుట్టుపక్కలన్న గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారాని పూజారి సతీష్ తెలిపారు. బుధవారం కాస్నా తండా గ్రామ సర్పంచ్ శంకర్ నాయక్ దంపతులు జల బిందెలతో అభిషేకం చేసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు పద్మ .కవిత. లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు

## భట్టువారిగూడెం రోడ్డుకు త్వరలో మోక్షం. ఏమ్మెల్యే రోషన్ కుమార్.

ఏమ్మెల్యే రోషన్ కుమార్
– బాల వారి గూడెం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ కే రామకృష్ణను తులసి విజ్ఞప్తి చేశారు.
దశాబ్దన్నర కాలంగా చింతలపూడి పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ రహదారి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారని పూర్తిగా తిన మంజూరు చేసి ప్రజలకు సౌకర్యం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దస్త్రాన్ని ప్రభుత్వ మంజూరు కోసం ముఖ్యమంత్రి కి పంపామని మరో రెండు ,మూడు రోజుల్లో ప్రభుత్వా అనుమతి రానున్నట్లు అని చెప్పారు.

# జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు గుర్తింపు కాదు.

**జర్నలిస్టుకి గుర్తింపు ఇచ్చేది అతని కలమే..!**
**నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డుతో ముడిపెట్టడం ప్రజాస్వామ్యానికి ముప్పు...!**
**హెచ్ఆర్సి ఆర్టిఐ సామాజిక కార్యకర్త రిపోర్టర్ బరిగెల విజయ్ కుమార్.**



జర్నలిస్టు గుర్తింపును అక్రిడేషన్ కార్డుతో ముడిపెట్టే ప్రయత్నాలు పెరుగుతున్న ఈ తరుణంలో, అక్రిడేషన్ కార్డు అసలు ఉద్దేశం ఏమిటి జర్నలిస్టు అంటే ఎవరు అనే మౌలిక ప్రశ్నలపై సమాజంలో స్పష్టత అవసరమని మీడియా వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గ్రహించకుండా జర్నలిజాన్ని కేవలం కార్డుల పరిధిలో బంధించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. అక్రిడేషన్ కార్డు అంటే ఏమిటని అక్రిడేషన్ కార్డు అనేది ప్రభుత్వం తన పరిపాలనా అవసరాల కోసం జారీ చేసే ఒక అధికారిక గుర్తింపు పత్రం మాత్రమేనని ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేయడం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రవేశ సౌలభ్యం కల్పించడం, ప్రభుత్వ పథకాలు, అధికారిక సమాచారం సులభంగా పొందడం వంటి అవసరాల కోసమే ఈ కార్డు ఉపయోగపడుతుందని, అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే అక్రిడేషన్ కార్డు జర్నలిస్టు హోదాను నిర్ధారించే ధృవీకరణ పత్రం కాదని అక్రిడేషన్ కార్డు అనేది కేవలం ప్రభుత్వ వ్యవస్థకు అవసరమైన ఒక పరిపాలనా సాధనం మాత్రమే అని జర్నలిస్ట్ మరియు ఆర్టిఐ సామాజిక కార్యకర్త న్యాయ పరిరక్షణ సేవ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బరిగెల విజయ్ కుమార్
అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జర్నలిస్టు అంటే ఎవరు జర్నలిస్టు అనేది ప్రభుత్వం ఇచ్చే కార్డుతో తయారయ్యే వ్యక్తి కాదని ప్రజల తరఫున మాట్లాడే వ్యక్తి జర్నలిస్టు అని అన్యాయం, అక్రమాలు, అవినీతిని నిర్భయంగా ప్రశ్నించే వ్యక్తి జర్నలిస్టు అని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే వ్యక్తి జర్నలిస్టు అని నిజాన్ని నిక్కచ్చిగా ప్రజల ముందుకు తీసుకెళ్లే వ్యక్తే నిజమైన జర్నలిస్ట్ అని జర్నలిజం ఒక కార్డు కాదని జర్నలిస్ట్ అంటే ఒక బాధ్యత, ఒక వృత్తి, ఒక సామాజిక కర్తవ్యమని అక్రిడేషన్ వర్సెస్ జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు జర్నలిస్టును సూచిస్తుందా అది జర్నలిస్టు విలువకు ప్రమాణమా ఈ ప్రశ్నలకు సమాధానం స్పష్టంగా కాదు అని అక్రిడేషన్ అనేది ప్రభుత్వ కార్యక్రమాలకు అనుమతి మాత్రమేనని జర్నలిస్ట్ విలువను నిర్ణయించేది అతని చేతిలో ఉన్న కార్డు కాదని అతని ప్రశ్నే అతని గుర్తింపు అని అతని నిజాయితీనే అతని హోదా అని అతని ధైర్యమే అతని అసలైన అక్రిడేషన్ అని అన్నారు. అక్రిడేషన్ లేకపోయినా జర్నలిస్టు విలువ ఏమాత్రం తగ్గదని జర్నలిస్టును గుర్తించేది ఎవరు? చట్టబద్ధంగా నమోదు అయిన, భారత ప్రభుత్వం గుర్తించిన పత్రికలో పనిచేస్తూ, సంబంధిత ఎడిటర్ జారీ చేసిన గుర్తింపు కార్డుతో వృత్తిని నిర్వర్తిస్తున్న వారి సంస్థ ఐడి కార్డే నిజమైన అక్రిడేషన్ అని జర్నలిస్ట్ మరియు ఆర్టిఐ సామాజిక కార్యకర్త న్యాయ పరిరక్షణ సేవ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బరిగెల విజయ్ కుమార్ అన్నారు.

## డా. ప్రసాద్ శెట్టికి 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు

నారాయణ పేట జిల్లా జనవరి 28,(95 న్యూస్):
నారాయణపేట జిల్లా కేంద్రంలోని పిఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ శెట్టి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సామాజిక సేవలో భాగంగా ఆయన చేసిన కృషికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.



రికార్డుకు గల ప్రధాన కారణాలు:
అత్యధిక హెల్త్ క్యాంప్స్ :
2025 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్షా శిబిరాలు నిర్వహించడం.
ఉచిత వైద్య సేవలు: శిబిరాలకు వచ్చిన రోగులకు ఎముకల దృఢత్వానికి సంబంధించిన పరీక్షలు చేయడమే కాకుండా, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయడం.
మేయర్ ఆర్గానిక్స్ భాగస్వామ్యం: ఈ సేవా కార్యక్రమాలను గుర్తించి, మేయర్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్ శెట్టి గారికి ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు.
ముఖ్య ఉద్దేశ్యం:గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఎముకల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మరియు నిరుపేదలకు ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా అందించడం.

# సెకండ్ ఎడిషన్ సి. ఎం కప్--2025 సాధించాలి.

- రిజిస్ట్రేషన్లు ఎక్కువగా పెంచాలి.
- అధికారులతో సీఎం కప్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహణ.
- సీఎం కప్ సాధించే దిశగా క్రీడాకారులకు ప్రత్యేక మెళకువలు నేర్పించాలి.
- డి ఆర్ వో ఈ. వెంకటాచారి.

సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 ను సాధించే దిశగా విద్యార్థులకు వివిధ క్రీడా విభాగాల్లో ప్రత్యేక మెళకువలు అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఈ. వెంకటాచారి సూచించారు. సెకండ్ ఎడిషన్ సీఎం కప్--2025 నిర్వహణకు సంబంధించి జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధ్యక్షతన హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సీఎం కప్--2025 నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. మండల స్థాయి పోటీలు ఫిబ్రవరి 2 , 3 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వివిధ అధికారుల అధ్యక్షతన మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అలాగే జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిబద్ధతతో వ్యవహరించాలని క్రీడా విధి విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే గత సీఎం కప్ ఎడిషన్లలో హైదరాబాద్ జిల్లా కప్ సాధించిందని




ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈసారి కూడా హ్యాట్రిక్ విజయాన్ని సాధించేందుకు నియమించిన కమిటీ సమన్వయంతో కలసి పనిచేయాలని సూచించారు. యువతను విస్తృతంగా భాగస్వామ్యులను చేయడం, ఉత్తమ క్రీడాకారులను గుర్తించడం, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో తగిన మౌలిక వసతులు, పరికరాలు అలాగే విశాలమైన మైదానాల ఎంపిక , వనరుల సమీకరణపై వివరించారు. పిల్లలు ఎక్కువగా క్రీడల్లో పాల్గొనే విధంగా రిజిస్ట్రేషన్ సంఖ్యను ఎక్కువగా పెరిగే విధంగా ప్రత్యేక కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా క్రీడ మైదానాలలో షామీయా నాలు, త్రాగునీరు, మెడికల్ శిబిరాలు తప్పక ఉండాలని సూచించారు.
జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (క్రీడలు) హేమలత మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్లే ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన అంశం అని పేర్కొని, గేమ్స్ ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లు, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఫీల్డ్ స్థాయి సిబ్బంది అందరూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు గరిష్టంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.
నగరవ్యాప్తంగా ఉన్న జీహెచ్ఎంసీ మైదానాలు, క్రీడా సముదాయాల గుర్తింపు, అందుబాటులో ఉన్న వసతుల వినియోగం, పరికరాల అందచేతపై ఆమె వివరించారు.జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సుధాకర్ మాట్లాడుతూ మండల మరియు జిల్లా స్థాయిల్లో ఫెడరేషన్ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పోటీలు క్రమబద్ధంగా, కాలపరిమితిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.
రిజిస్ట్రేషన్లు, మైదానాల ఎంపిక, అర్హత గల సాంకేతిక అధికారులు, కోచ్‌ల నియామకం , పరికరాల అందుబాటు, అలాగే ఫలితాలను అదే రోజు అప్‌లోడ్ వంటి అంశాలపై తెలిపారు.సీఎం కప్--2025 లక్ష్యం గ్రాస్‌రూట్ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, పట్టణ--గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించడం, మండల మరియు జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీల ద్వారా భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దడం అని ఆయన వివరించారు. దీర్ఘకాలికంగా ఒలింపిక్స్--2036లో పతకాల సాధనకు దోహదపడేలా ఈ కార్యక్రమం రూపకల్పన చేయబడిందన్నారు. ఈ కప్‌లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో--ఖో, వాలీబాల్, యోగా, క్యారమ్, చెస్, కరాటే, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, జూడో, కిక్‌బాక్సింగ్, నెట్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, వూషూ, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, పారా గేమ్స్ పిల్లల కోసం వినోదాత్మక క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి పవన్, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరులు, పాఠశాల విద్య సహాయ సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడల అథారిటీ ప్రత్యేక అధికారి సతీష్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పి ఈ టి లు, కోచ్‌లు, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు, క్రీడా సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్లు మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహాజాతరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం : గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మేడారం లో ఈ రోజు నుండి నిర్వహిస్తున్న సమ్మక్క--సారలమ్మ మహాజాతర సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.
గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క--సారలమ్మలు ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన మేడారం మహాజాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమని ఆయన అన్నారు.
ఈ పవిత్ర మహోత్సవం సందర్భంగా సమ్మక్క--సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి



కుటుంబాల్లో ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..."ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో మేడారం మహాజాతరకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాం. రూ.250 కోట్ల నిధులు కేటాయించి మౌలిక వసతులు, త్రాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా, విద్యుత్, భద్రతను మరింత బలోపేతం చేశాం."
అదేవిధంగా, భారీగా తరలివచ్చే భక్తుల దృష్ట్యా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, పార్కింగ్ సదుపాయాలు విస్తరించినట్లు మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.
మహాజాతర సందర్భంగా గిరిజన సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కడా భంగం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, భక్తుల భద్రత దృష్ట్యా పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. భక్తులు శాంతియుతంగా, క్రమశిక్షణతో జాతరలో పాల్గొని దైవ దర్శనం చేసుకోవాలని కోరిన మంత్రి, ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లకు భక్తుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

# అన్నిరకాల సర్వీస్ ప్రొవైడర్ల నోడల్ అధికారులతో నగర సీపీ వీసీ సజ్జనర్ సమన్వయ సమావేశం

హైదరాబాద్‌ను నేరరహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ బుధవారం బషీర్‌బాగ్ లోని పాత కమిషనర్ కార్యాలయంలో అన్నిరకాల సర్వీస్ ప్రొవైడర్ల నోడల్ అధికారులతో కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. టెలికాం, ఇంటర్నెట్, ఫుడ్ డెలివరీ, కొరియర్, రవాణా, అన్ని రకాల సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సమావేశంలో సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమాచారం అడిగిన వెంటనే స్పందించేందుకు వీలుగా ప్రతి సంస్థలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కేవలం లాభార్జనే ధ్యేయంగా కాకుండా సర్వీస్ ప్రొవైడర్లు సామాజిక బాధ్యతతో



వ్యవహరించాలని హితవు పలికారు. ఈ-కామర్స్, కొరియర్ సేవల మాటున గంజాయి, మత్తు పదార్థాలు, నిషిద్ధ వస్తువుల రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో... ఆయా సంస్థలు పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు.అనుమానిత పార్శిల్స్‌ను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ట్రాన్స్ పోర్ట్ సర్వీస్ ప్రొవైడర్లలో కొంత మంది క్యాబ్, బైక్ డ్రైవర్లు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్లు తమ డ్రైవర్లపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.ప్రయాణికులు బుక్ చేసుకున్నప్పుడు.. వెళ్లాల్సిన ప్రదేశం చెప్పిన తర్వాత లేదా డబ్బు చెల్లించిన తర్వాత డ్రైవర్లు రైడ్ క్యాన్సిల్ చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి డ్రైవర్లపై సంస్థలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు ఎం.శ్రీనివాస్, ఐపీఎస్, తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, శ్వేత, ఐపీఎస్, డీసీపీ సైబర్ క్రైమ్స్ అరవింద్ బాబు తో పాటు జోన్ల డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు.
ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట




ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయండి..

**కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం..**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**కాంగ్రెస్లో చేరిన 5వ డివిజన్ ముస్లిం మైనార్టీ నాయకులు..**



కార్పొరేషన్ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు విజ్ఞప్తి చేశారు. అందర్నీ కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్లోని 5 వ డివిజన్ రజ్వి చమన్ నుంచి ఎండి జైనుల్లాబుద్దీన్ పాటు 30 మంది ముస్లిం మైనారిటీ నాయకులు రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు ను శాలువాలు పూలదండలతో రాజేందర్రావును మైనార్టీ నాయకులు సత్కరించారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని అభ్యర్థులకు గెలుపును కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండి జైనుల్లా బుద్ధిన్ అలియాస్ జమీర్ పర్వేషాఖాన్ ఎండి ఇమాముద్దీన్ ముభిన్, జేషాన్ ఎంఏ రజాక్ కైరుద్దీన్, అబ్దుల్ రషీద్ తో పాటు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా 62 వ డివిజన్ నుంచి పూరేళ్ల సరోజ రాజేందర్ రావును కలిసి సత్కరించారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ (2.0) కింద నూతన ఎస్డబ్ల్యూఎం ఇంజినీర్లకు జిహెచ్ఎంసీ ఓరియెంటేషన్

**ప్రోగ్రామ్**
**-- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26, ఘన వ్యర్థాలు, సీ ౘ డీ వ్యర్థాలు, బల్క్ గార్బేజ్ జనరేటర్లపై శిక్షణ**



స్వచ్ఛ భారత్ మిషన్ -- అర్బన్ (2.0)లో భాగంగా జిహెచ్ఎంసీ బుధవారం నూతనంగా నియమితులైన
సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లకు ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో జిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (ఆరోగ్యం ౘ పారిశుధ్యం) రఘు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించింది. కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు -- 2024, వాటిలో జరిగిన తాజా సవరణలు, అలాగే ఫీల్డ్ స్థాయిలో అమలులో ఎదురయ్యే ఆపరేషనల్ సవాళ్లపై అధికారులకు అవగాహన కల్పించారు.
ఓరియెంటేషన్ కార్యక్రమంలో
రఘు ప్రసాద్ మాట్లాడుతూ నగర పారిశుధ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరించడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో నగర పనితీరును మెరుగుపరచవచ్చు అన్నారు.
జిహెచ్ఎంసీ ౘఔవీ సూపరింటెండింగ్ ఇంజినీర్ గోపాల్ మాట్లాడుతూ....
నూతనంగా చేరిన ఇంజినీర్లు ఫీల్డ్ స్థాయిలో చురుకైన పాత్ర పోషిస్తూ, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.
ఈ ఓరియెంటేషన్‌లో
స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 (10వ ఎడిషన్) టూల్‌కిట్, ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలు, నిర్మాణ ౘ కూల్చివేత (సీ ౘ డీ) వ్యర్థాల నిర్వహణ, అలాగే బల్క్ గార్బేజ్ జనరేటర్ల నిబంధనల అమలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.
ఫీల్డ్ స్థాయిలో అవగాహన కార్యక్రమాల కోసం అవసరమైన ఐఈసీ మెటీరియల్‌ను కూడా స్వచ్ఛ భారత్ మిషన్ బాధ్యులు ఇంజినీర్లకు అందజేశారు.

# మార్చి నెలలో హైదరాబాదులో అఖిలభారత పోలీస్ ఫుట్ బాల్ సమరం

- **74 వ బి.ఎన్.మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ చాంపియన్ షిప్ నిర్వహణపై డిజిపి సమీక్ష**



74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో బుధవారం నాడు జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో గతంలో చక్కని ఫుట్ బాల్ క్రీడాకారులు ఉండేవారని, 1956వ సంవత్సరంలో జరిగిన మెల్బోర్న్ ఒలింపిక్స్ లో సెమీఫైనల్ చేరిన భారత ఫుట్ బాల్ జట్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు నూర్ మొహమ్మద్, జుల్ఫీకరుద్దీన్, అహ్మద్ హుసేన్, అజీజుద్దీన్, బలరాం, తంగరాజ్, వంటివారు పాల్గొన్నారన్నారు. వీరిలో అయిదుగురు హైదరాబాద్ సిటీ పోలీస్ వారు. ఆ జట్టు కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ కూడా హైదరాబాదీయే. కాలక్రమేనా పోలీసు ఉద్యోగుల్లో ఫుట్ బాల్ క్రీడ పట్ల ఆసక్తి సన్నగిల్లిందని అభిప్రాయపడ్డారు. 74 వ బీ.ఎన్.మల్లిక్ అఖిల భారత ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించే అవకాశం ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు వచ్చిందన్నారు. ఛాంపియన్ షిప్ పోటీల పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ ఈ ఏడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాదులో నిర్వహించనున్నామన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు, 11 కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు మరియు 6 కేంద్ర పోలీస్ సంస్థల నుంచి మొత్తం 53 జట్లు ఈ క్రీడా సమరంలో పాల్గొంటాయని డిజిపి తెలిపారు. సుమారు 1060 మంది పురుష క్రీడాకారులు, 350 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు మరియు ఇతర అధికారులతో కలిపి మొత్తం 2000 మందికి పైగా ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. మొత్తం 12 రోజుల పాటు సాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో 125 మ్యాచ్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని ఎచ్ఎఫ్‌సి గ్రౌండ్, మోయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ మైదానాలతో పాటు మరికొన్ని ప్రధాన మైదానాల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు.

ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు తాను చైర్మన్ గాను, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా , అడ్మినిస్ట్రేషన్ కమిటీలో ఐపిఎస్ అధికారులు అభిలాషా బిస్త్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, వి.సి. సజ్జనార్, అవినాష్ మహంతి, గజరావు భూపాల్ వంటి సీనియర్ అధికారులు వివిధ బాధ్యతలను నిర్వహిస్తారన్నారు. మార్చి 23న జట్ల రిపోర్టింగ్ తో ప్రారంభమయ్యే ఈ క్రీడల షెడ్యూల్‌లో భాగంగా మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా ఆరంభ వేడుకలు జరగనున్నాయని, ఏప్రిల్ 5న తుది పోరు అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీ కోసం తెలంగాణ పోలీస్ అకాడమీలో క్రీడాకారులందరికీ వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా, జట్ల రాకపోకల కోసం 45 ప్రత్యేక బస్సులు మరియు అధికారుల కోసం ఇతర వాహనాలను సిద్ధం చేస్తామని, క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి గ్రౌండ్ వద్ద ఒక అంబులెన్స్ తో పాటు వైద్య బృందం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాంకేతికపరంగా ఈ టోర్నీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నుండి 40 మంది ప్రతినిధులు మరియు రిఫరీలు హాజరవుతున్నారనీ, మ్యాచ్‌ల సమయంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి జ్యూరీ ఆఫ్ అప్పీల్స్ కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ నుంచే ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందని, అఖిల భారత స్థాయి పోటీలు రాష్ట్ర ప్రతిష్టను చాటిచెప్పేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. అడిషనల్ డిజిపి అనిల్ కుమార్, మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, స్పోర్ట్స్ ఐజిపి డాక్టర్ గజరావు భూపాల్, హైదరాబాద్ శాంతిభద్రతల అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, విజిలెన్స్ డిఐజి అభిషేక్ మహంతి, యూసఫ్ గూడా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు సమావేశంలో

# రాజేంద్రనగర్ లో ప్రారంభమైన సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలని ప్రజలకు అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ పరిధిలో సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేలను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...మేడారం జాతర తరహాలో రాజేంద్రనగర్ లో కూడా వనదేవతలను కొలుస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని ఇక్కడ స్థానిక గిరిజన సాంప్రదాయాల ప్రకారం పూజలు జరుగుతాయని అన్నారు.మేడారానికి వెళ్లలేని నగరవాసులు రాజేంద్రనగర్ ప్రాంతంలో జరిగే ఈ జాతరలో పాల్గొంటారని ఇలాంటి జాతర తన ప్రాంతాల్లో జరగడం సంతోషకర విషయమని పేర్కొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ జి.జితేందర్ రెడ్డి, ఆడిట్ పరిశీలకులుగా నియమితులు



కరీంనగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికల పరిశీలకులుగా నియామకమైన హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ జి.జితేందర్ రెడ్డి, ఆడిట్ పరిశీలకులుగా నియమితులైన పెద్దపల్లి జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎం.మనోహర్ లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి హుజూరాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికలకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.

# రాజశ్యామల యాగం లో పాల్గోన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపం లో దత్తగిరి ఆశ్రమం అద్వర్యం లో లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ రాజ శ్యామల యాగం లో పాల్గోన్నారు . ఈ సందర్బంగా దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ గారి నేతృత్వం లో పండితులు , వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు తమ మంత్రోచ్ఛారణ తో రాజశ్యామల యాగం ను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిచే నిర్వహించారు .అనంతరం పూర్ణహుతి కార్యక్రమం లో పాల్గోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

# వివాహేతర సంబంధం.. అత్తతో కలిసి మేనమామను చంపిన మేనల్లుడు!



నల్గొండ విద్యావిభాగం: అత్తతో కలిసి మేనల్లుడు సొంత మేనమామను హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం సీత్యాతండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమావత్ రవి (34) వేములపల్లి మండలంలోని సల్కునూరు పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు మిర్యాలగూడ మండలం ఏడు కోట్లతండాకు చెందిన లక్ష్మితో 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు.

రవి అక్క కుమారుడు గణేశ్‌తో భార్య లక్ష్మి గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలియటంతో భర్త రవితో పాటు కుటుంబసభ్యులు ఇద్దరిని పలుమార్లు మందలించారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నెల 26న (సోమవారం) భార్యభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఆ తర్వాత రవి డ్యూటీకి వెళ్లిపోగా భార్య లక్ష్మి పెద్దకొడుకును ఇంట్లో వదిలి తల్లి ఇంటికి వెళ్లిపోయింది.

మరుసటి రోజు రాత్రి లక్ష్మి ఇంటికి వచ్చి భర్త రవితో గొడవ పడింది. మరో గదిలో ఉన్న అతడి తండ్రి లక్ష్మానాయక్.. ఇది తరచూ జరిగే గొడవే కదా అని నిద్రపోయాడు. తెల్లారి లేచి చూసేసరికి.. రవి నిద్ర లేవలేదు. తట్టి లేపే ప్రయత్నం చేస్తే.. తలపై గాయంతో రవి విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం రవి భార్యకు ఫోన్ చేస్తే అందుబాటులో లేకుండా పోయింది. అయితే ఆమె మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య లక్ష్మి.. మేనల్లుడు గణేశ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు తండ్రి లక్ష్మానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో జరుగుతున్న మున్సిపల్? ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నామినేషన్లకు అవసరమైన పత్రాలన్నీ అందుబాటులో ఉంచాలని సూచించారు. మోత్కూరు, ఆలేరు మున్సిపల్ కార్యాలయాలను సందర్శించారు. ఆయన వెంట ఆర్డీవో మాలి క్రిష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# అధికార పార్టీకి ఓటు వేద్దాం.. అభివృద్ధికి బాటలేద్దాం..

**మున్సిపల్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో**




**కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేద్దాం...**

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. నేడు ఇందిరా భవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం...అనంతరం చీఫ్ పైనలిబ్రౌచర్ విడుదల చేసి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర, ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం మరియు ఓట్ చోరీ, జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ గారి పేరును మార్చే విధంగా బిజెపి మోడీ సర్కార్ చేస్తున్న కుట్రను ప్రజలకు తెలియజేయాల్సిందిగా కోరుతూ... దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న మద్దతు' లివిత్ ఐవైసి యాప్ మరియు పలు అంశాలపై దిశా నిర్దేశం చేయడం జరిగింద ని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో- ఇంచార్జ్ లు రోష్ని జైస్వాల్ కె.ఆర్ భవ్య మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శిలు, జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు...

# మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

**నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశాలు**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం దుంపలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి బుధవారం ఆకస్మికంగా తనికి చేశారు. ఆహార పదార్థాలు అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, సాంబారు పరిశీలించారు. కూర నాణ్యత మెరుగుపరచాలని విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు కొలత ప్రకారం వంట చేసేలా మానిటర్ చెయ్యాలని టీచర్లను ఆదేశించారు. విద్యార్థులకు కడుపు నిండా తినేలా సరిపడినంత అన్నం కూరలు పెట్టాలని మీ ఇష్టానుసారం పెడితే సహించేది లేదని వంట సిబ్బందిని





హెచ్చరించారు.విద్యార్థులకు మరల అన్నం, కూరలను వారు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలి వంట సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేస్తున్నపుడు విద్యార్థులు లేవకూడదని తెలిపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. భోజనం ఎలా ఉంది రోజు ఎలా పెడుతున్నారని అడగ్గా బాగానే ఉందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఒక్క మెతుకు కింద పడకుండా శుభ్రంగా నెమ్మదిగా తినాలని విద్యార్థులకు సూచించారు. డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలు చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని స్కావెంజర్ ను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం చదువు విషయం లో రాజీ పడవద్దని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

అంతకుముందు ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆహార పదార్థాలను తనికి చేసి మంచి ఆహారం అందించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పిల్లలు చాలా ముద్దుగా ఉన్నారని బాగా తిని ఆడుకోవాలని సూచించారు.

# జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో ఎన్నికలు

**72 వార్డులు... 176 పోలింగ్ కేంద్రాలు**
**ఈనెల11న పోలింగ్**
**13 తేదీన ఫలితాలు**
**పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి**
**జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడి**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు - 2026 ప్రక్రియలో మున్సిపల్ ఎన్నికలకు జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడించారు. ఈ మేరకు జిల్లాలోని చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం, దుబ్బాక మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియను ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి బుధవారం పరిశీలించారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,** మునిసిపాలిటీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. జిల్లాలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఈ రోజు నుండి 3 రోజుల పాటు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా మున్సిపల్ సెంటర్ లో నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ హైమావతి వెల్లడించారు.4 మున్సిపాలిటీల్లో 72 వార్డులలో 176 పోలింగ్ స్టేషన్ లలో ఫిబ్రవరి 11 వ తేదీన పోలింగ్, 13 వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం సెంటర్ చుట్టు 100 మీటర్లలో 144 సెక్షన్ అమలుతో పాటు నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి పంపించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. నామిని అభ్యర్థి సెంటర్ కి వచ్చిన సమయం నుండి నామినేషన్ వేసి బయటికి వెళ్ళే సమయాన్ని నోట్ చేసుకుని మొత్తం ప్రక్రియను వీడియో తీయించాలని మున్సిపల్ కమిషనర్లు ఆదేశించారు. నామినేషన్ సెంటర్ లో ఫోన్ అనుమతి లేదని అన్ని సెంటర్లలో 100 శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు.

# ఆపదలో అపన్న హస్తం సీఎం సహాయనిధి

**సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ**
**లబ్ధిదారులకు అందచేసిన కాంగ్రెస్ నాయకులు**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలోని సముద్రాల గ్రామంలోని పలువురు పేదలకు సీఎం సహాయ నిధి కింద చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్రముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సహాయ నిధి ద్వారా మన హుస్నాబాద్ శాసనసభ్యులు, బీసీ సంక్షేమ శాఖ, రవాణ శాఖ మంత్రి




వర్యులు పొన్నం ప్రభాకర్ సహకారంతో లబ్ధిదారులకు అందజేసినట్లు వారువెల్లడించారు.సీఎం సహాయ నిధి లబ్ధి దారులలోవంగర గాల్ రెడ్డి,కల్లెం రాజు లకు 20వేల రూపాయల చొప్పున చెక్కులను పంపిణీ చేయగా, పిల్లి రాజయ్య కు 17,500 చెక్కును అందజేశారు. తమ కుటుంబాలకు సీఎం సహాయనిధి చొప్పున ఆర్థిక సహాయం అందడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం కనబరిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అట్ల శ్రీనివాస్, ఐ ఎన్ సి సముద్రాల గ్రామ శాఖ అధ్యక్షులు పున్నం సత్తయ్య, ఉపాధ్యక్షులు మరియు 5వ వార్డ్ మెంబర్ గట్టు శ్రీనివాస్, ఐ ఎన్ సి యూత్ ప్రెసిడెంట్ గడ్డం రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం లక్ష్మారెడ్డి, ఎలుగుమెట్ల సుధాకర్ రెడ్డి, పున్నం యాదయ్య, ఉప్పుల వెంకన్న, సోషల్ మీడియా అధ్యక్షులు చేర్యాల తిరుపతి, పిల్లి మహేందర్, ఇసంపల్లి తిరుపతి పాల్గొన్నారు.

# స్కూల్ బస్ బోల్తా...పలువురు విద్యార్థులకు గాయాలు...

**రోజు రోజుకు దారణగా మారుతున అప్పాజన్పన్ నుండి బీజాపూర్ వెళ్ళే రహదారి...**
**మృగవని వద్ద బసు బోల్తా విద్యార్థులకు గాయాలు...**
**చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ**



స్కూల్ బస్ బోల్తా కొట్టి విద్యార్థులకు గాయాలైన ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మృగవని పార్కు వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బండ్లగూడ జాగీర్ లోని హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ స్కూలుకు చెందిన టీజీ 07వీ 2935 గల బస్సు హైదరాబాద్ నుంచి మొయినాబాద్ వెళ్తున్న సమయంలో మృగావని పార్కు వద్దకు చేరుకోగా.. ముందున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో విద్యార్థులు ఉన్నారు. ప్రమాదం కారణంగా పలువురు విద్యార్థులు గాయపడడంతో వారిని స్థానిక ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ప్రమాదం కారణంగా హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# సమ్మక్క సారలమ్మల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్యాన్ని స్థాపిద్దాం

**ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు**

మేడారం స్వరాజ్యంపై కాకతీయ రాజులు చేసిన అధర్మయుద్ధాన్ని ఎదుర్కొని మేడారం రాజ్య ప్రజలను రక్షించిన రక్షకులు పగిడిద్దరాజు సమ్మక్క సారలమ్మ మహారాణులే తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు పోరాటస్ఫూర్తి ప్రదాతలు అని ఎల్కతుర్తి మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు

కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు తనకు కప్పం కట్టమని మేడారం పగిడిద్దరాజును ఆదేశిస్తే తాము పన్ను కట్టమని మేడారం స్వతంత్ర స్వరాజ్యమని చాటి చెప్పారు అధర్మ యుద్ధానికి వచ్చిన కాకతీయ సైన్యంపై పగిడిద్దరాజు కుటుంబం




విరోచిత పోరాటం చేసి మేడారం ప్రజలకు రక్షకులుగా నిలిచారు సమ్మక్క మహారాణి ఒక చేతిలో బల్లెం మరో చేతిలో ఖడ్గం చేతబోని కాకతీయ సైన్యాన్ని ఆడ పులి వలె వెంటాడి వేటాడి కాకతీయులను భయభ్రాంతులకు గురి చేసింది సమ్మక్క సారలమ్మ మహారాణులు స్వధర్మాన్ని స్వరాజ్యాన్ని రక్షిస్తూ ఒక విరోచిత పోరాట పటిమను స్ఫూర్తిని భావితరాలకు అందించారు అని అన్నారు నేడు మన తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలందరూ మేడారం పగిడిద్దరాజు సమ్మక్క సారలమ్మల స్వరాజ్యాన్ని పునర్జీవింపజేయడం కోసం ప్రజాస్వామ్యంలో ఓటు అనే జ్ఞానఖడ్గంతో మూలవాసుల స్వరాజ్యాన్ని నిర్మించు కోవాలని అన్నారు సమ్మక్క సారలమ్మల సాక్షిగా బహుజన ప్రజలందరూ వజ్రాయుధం లాంటి ఓటు హక్కును మనీ మద్యం మాంసం లాంటి ప్రలోభాలకు అమ్ముకోకుండా స్వధర్మ మార్గంలో ఉంటామని ప్రతిమ భూని తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్యాన్ని నిర్మించాలని ఈ సందర్భంగా బొంకూరి రాజు అన్నారు.

# అయ్యప్ప వాటర్ సొల్యూషన్ నూతన షాపు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన జనసేన పార్టీ ఇంచార్జ్

**ఎస్పిఎస్ స్టేట్ ప్రెసిడెంట్ కోర్ర చందు నాయక్**

దేవరకొండ పట్టణం కొండమల్లేపల్లి చౌరస్తాలో అయ్యప్ప వాటర్ సొల్యూషన్స్ సేల్స్ అండ్ సర్వీస్ నూతన షాపు ప్రారంభోత్సవనికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ ఇంచార్జ్ కోర్ర చందు నాయక్ చేతుల మీదుగా మొదటి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది అనంతరం కొర్ర చందు నాయక్ మాట్లాడుతూ.యువత ఎవరో వచ్చి ఏదో చేస్తారని నమ్ముకోకుండా వాళ్ల సొంత ఆలోచనతో వాళ్ళ కాళ్ళపై వాళ్లు నిలబడి ముందుకెళ్లాలి ప్రొప్రైటర్ క్రాంతి కుమార్ కి చందు నాయక్ అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు షాప్ యజమానులు చందు నాయక్ గారికి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేస్తూ స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో చందు నాయక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోమటి



వెంకట్ రెడ్డి అనుచరుడు కంటి వైద్యులు శివ, జనసేన పార్టీ నాయకులు పిట్ల సిద్దు, జనసేన పార్టీ చింతపల్లి అధ్యక్షులు శివ, యూట్యూబ్ స్టార్ ఆర్య శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# కులవృత్తిలో రాటుదేలిన యోధుడు పట్టువదలని విక్రమార్కుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామాని కిచెందిన కొండ.వెంకటరమణ గౌడ్ 85 సంవత్సరాలు వయస్సు

ఇప్పటికీ అతను వృత్తిలో 65 సంవత్సరాల నుండి గీత కార్మికునిగా తాటి చెట్లను ఈత చెట్లను అతను వృత్తిని కొనసాగిస్తూ ఇప్పటికీ తాటి చెట్ల నుండి కల్లు తీస్తూ వృత్తిని నమ్ముకొని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఎంతోమందికి మన వృత్తి మనకు ముఖ్యమని తన వృత్తిని ఎదుటివారికి చెప్పడమే కాకుండా ఎంత ధనవంతులైన మన కులవృత్తినిమనం మానుకోవద్దని ఈ కాలంలో మత్తుకు





మద్యానికి బానిసలవుతున్నటువంటి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు యువకులకు మరియు ప్రతి ఒక్కరికి మందు బీరు ముఖ్యం కాదు మద్యం మానుకోండి చెట్లనుండి తీసే కల్లు ఆరోగ్యానికి. చాలా మంచిదని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు వృత్తి మానుకుంటే మనకు జీవనోపాధి లేదంటూ వృత్తి చేస్తూ ఎదుటి వారి ఆరోగ్యాలను కూడా చూడాలని అందరికీ ఆదర్శంగా

# ఉత్తమ సేవ పురస్కారం గ్రహిత జింకల రామ్మూర్తినీ సన్మానం ఘనంగా సన్మానించిన రాయపట్నం గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు

గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి అందించే ఉత్తమ సేవ పురస్కార ప్రశంస పత్రాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ నుండి మధిర మున్సిపాలిటీ ఉద్యోగి ,రాయపట్నం గ్రామ వాస్తవ్యులు జింకల శ్రీరామ్మూర్తి పొందిన సందర్భంలో ఈరోజు రాయపట్నంలో గ్రామ సర్పంచ్ గోళ్ళ గోపి మరియు గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు..



## మున్సిపల్ ఎన్నికలలో నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి,

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్,**





2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణ విడుదల అయినందున నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చెన్నూర్ సి. ఐ. బన్సీలాల్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తుల నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు లోబడి నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలి,

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్,**






2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తుల నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనులు మూసి వేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు,

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి,**





బొగ్గు గనులు మూసి వేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనులు సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అన్ని బొగ్గు కంపెనీల జనరల్ మేనేజర్లతో మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలపై తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మాట్లాడుతూ గనులు మూసివేసిన తర్వాత సంబంధిత ప్రాంతాలను స్థిరీకరించి సామాజిక అభివృద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీ లలో భాగంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం, క్రీడా ప్రాంగణాలు నిర్మించడం, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని, గనుల మూసివేతకు ముందు, తరువాతకు ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్ లోడ్ చేయాలని, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మైనింగ్ చేయడం ద్వారా సంబంధిత ప్రాంతాలలో ప్రకృతి దెబ్బతింటుంది అనే భావనను ప్రజలలో తొలగించాలని, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మంచిర్యా జిల్లాలో మూసి వేయబడిన బొగ్గు గనుల ప్రాంతంలో హాస్పటల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో మూసివేయబడిన బొగ్గు గనుల పరిసర ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధి కొరకు 115 కోట్ల రూపాయలు మంచిర్యాల జిల్లాకు కేటాయించడం జరిగిందని, ఈ నిధులు గనులు మూసి వేయబడిన ప్రాంతాలలో వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, గనులు భూగర్భ శాఖ ఎ.డి. జగన్ మోహన్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జి.ఎం. సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్టేట్స్ మేనేజర్లు వరలక్ష్మి, సింగరేణి పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్ హనుమాన్

## వేములవాడ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపన్నగారి మాధవి లతగత ఎన్నికల్లో 28 వార్డులో స్వల్ప తేడాతో ఓటమికండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ మున్సిపల్ 28 వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారురాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని విప్ సూచించారు గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందని అన్నారు వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

## "షాబాద్ మండల ఉత్తమ ఎమ్మార్వోకు ఘన సన్మానం"

**చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ**



రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలానికి చెందిన ఎమ్మార్వో ఎండి. అన్వర్ ఉత్తమ ఎమ్మార్వోగా అవార్డు పొందిన సందర్భంగా ఆయనను బీసీ సేన నాయకులు కలిసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ , ఎమ్మార్వో ఎండి. అన్వర్, ను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, న్యాయ సమనాత్వంతో విధులు నిర్వహించి నందుకుగాను ఎండి. అన్వర్‌కు ఈ అవార్డు దక్కడం సంతోషకరమైన విషయం అని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మార్వోగా ఆయన అందిస్తున్న సేవలు మండల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షులు దయాకర్ చారి, పద్మా రెడ్డి, విట్టలయ్య, అబ్బాస్,తో పాటు పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందిస్తూ భవిష్యత్తులో కూడా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎండి. అన్వర్,కు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ఇన్‌చార్జిగా గోలి రాజేశ్వరరావు నియామకం

**17, 19 కౌన్సిలర్ వార్డుల ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించినందుకు ధన్యవాదాలు రాజేశ్వర రావ్**




హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 17, 19 కౌన్సిలర్ వార్డుల ఎన్నికల ఇన్‌చార్జిగా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు హుస్నాబాద్ ఎమ్మెల్యే రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి గోలి రాజేశ్వరరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి పురపాక ఎన్నికలలో మంచి ఫలితాలకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి - భీమ్ భరత్ గారు

**ఏ ఐ సి సి సెక్రటరీ విశ్వనాథం గారు హజరయ్యారు..**
**వీ బీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి**
**పేదల కడుపు నింపే ఇలాంటి పథకం ప్రపంచంలో ఎక్కడా లేదులి**
**చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ గారు**
**చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ**



మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలో (25 ఆదివారం నాడు) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని గౌరవ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ శ్రీమతి మీనాక్షి నటరాజన్ పిలుపుమేరకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి సూచనలతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వి బి జి రామ్ జి ఉపాధి హామీ పథకం కు నిరసనగా,రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామం లో పెద్ద ఎత్తున లిరంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు/రాష్ట్ర, టీ యు ఫ్ ఐ



# నిజంగా నేను నటించగలనా

"ది రాయల్స్' సిరీస్‌ను ప్రేక్షకులు చూడటం సంతోషంగా ఉన్నప్పటికీ.. దాని గురించి వచ్చిన విమర్శలు నన్ను కదిలించాయి" అని అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మెరుస్తూనే.. థ్రిల్ పంచే సిరీస్‌లతో ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటుతోంది. భూమి ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'దల్దాల్'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో డీసీపీ రీటా పాత్రలో నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సిరీస్ ఈ నెల 30న రానుంది. ఈ నేపథ్యంలోనే రాబోయే సిరీస్, తనపై వచ్చిన విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకొంది భూమి.

"దల్దాల్' అనేది ఒక క్రైమ్ థ్రిల్లర్. ఇందులో నేను యాంటీ హీరోగా కనిపిస్తా. అధిక ప్రాధాన్యత ఉన్న ఈ పాత్రలో నటించేందుకు చాలా థ్రిల్‌గా ఫీల్ అయ్యాను. ఇలా మహిళలే కేంద్రంగా చేసుకొని మరిన్ని కథలు రావాలని కోరుకుంటున్నా. నేను ఎంచుకునే ప్రతి పాత్రలోనూ నా ప్రాణం పెట్టి పని చేస్తా. ఇందులో నటించడం ఎంత సంతోషంగా ఉందో అన్ని సవాళ్లను కూడా ఎదుర్కొన్నాను".

### ఏ షూటింగ్‌కు వెళ్లలేదు

"గతేడాది నేను నటించిన 'ది రాయల్స్' సిరీస్‌పై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవన్నీ నన్ను చాలా నిరుత్సాహపరిచాయి. మానసికంగా అలసిపోయాను. ఆ ఎదురుదెబ్బతో.. ఒక నటిగా, వ్యక్తిగా నేను ఎవరో అనే దానిపై అవగాహనను పూర్తిగా కోల్పోయా. అందుకే నేను వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఆ విమర్శలు.. నన్ను సినిమా సెట్ నుంచి దాదాపు తొమ్మిది నెలల పాటు దూరంగా ఉండేలా చేశాయి. జూన్ నుంచి ఏ షూటింగ్‌కు వెళ్లలేదు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎన్నో ప్రశ్నల్ని ఎదుర్కొన్నాను".

### నాలో ప్రతిభ ఉందా


"నా నటనకు ఉపయోగపడే నిజమైన అనుభవం నాలో ఏమీ మిగల్లేదు అనిపించింది. అది నన్ను ఇంకా భయపెట్టింది. నాకు ఎప్పుడూ ఒక భయం ఉంటుంది. అదేంటంటే.. నేను ఎప్పుడూ ఒక సాధారణ నటిగా మిగిలిపోకూడదని అనుకుంటా. ఆ స్థాయికి కూడా చేరుకున్నా. కానీ వాస్తవాల్ని, విమర్శల్ని అంగీకరించడం ముఖ్యం. అయినా నేను ఏం చేయగలనో నాకు తెలుసు. 'ది రాయల్స్'పై వచ్చిన ట్రోలింగ్స్ వల్ల అయోమయంలో పడ్డాను. దాంతో నా పాత సినిమాలను తిరిగి చూశా. నేను నిజంగా నటించగలనా నాలో ఆ ప్రతిభ ఉందా అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. అంతగా ఆ విమర్శలు నన్ను కదిలించాయి".

### అన్నింటికీ దూరమైనా..

"నేనెప్పుడూ సినిమాల నుంచి ఇంత విరామం తీసుకోలేదు. చిత్రీకరణల నుంచి దూరంగా ఉన్నప్పుడు అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును కూడా తిరిగి ఇవ్వాల్సి వచ్చింది. ఇది కేవలం సినిమాలను తిరస్కరించడం మాత్రమే కాదు.. మీడియాలో నా ఉనికిని తగ్గించుకోవడం. నేను అవార్డు కార్యక్రమాలు, ఫ్యాషన్ ఈవెంట్‌లకు కూడా హాజరు కానని చెప్పా. ఇలా నేను అన్నింటికీ దూరమైనా కూడా నా సొంతంగా నేను బతకగలనో లేదో తెలుసుకున్నా. విరామ సమయాల్లో ఖాళీగా లేను. పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం ప్రయాణించడం లాంటివి చేశా"

## అల్లు అర్జున్, లోకేశ్ మూవీకి సోషల్ మీడియాలో ట్రెండ్

అల్లు అర్జున్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా





రానున్న విషయం తెలిసిందే. ఎఎ23గా ఇది ప్రచారంలో ఉంది. ఇంకా షూటింగ్ కూడా ప్రారంభం కాని ఈ సినిమా అప్పుడే సోషల్ మీడియాలో రికార్డును సొంతం చేసుకుంది. ఇటీవల ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ థీమ్ సాంగ్ విడుదల చేశారు. ఇప్పుడది సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. ఏకంగా ఈ థీమ్ సాంగ్‌పై ఇన్‌స్టాలో 3,55,000 రీల్స్ క్రియేట్ అయ్యాయి. కొన్ని రోజులుగా ట్రెండ్ అవుతోన్న 'ఎనిబిసనీటబీఞ। ఓ÷ూబ।'÷బి వీడియోకు ఈ సాంగ్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో 13 రోజుల్లోనే లక్షల రీల్స్ ఈ పాటతో క్రియేట్ అయ్యాయి. అత్యధిక రీల్స్ పొందిన థీమ్ సాంగ్‌గా ఈ పాట రికార్డు నెలకొల్పింది. ఇప్పటికీ టాప్‌లో కొనసాగుతోంది. ఈ ఏడాదిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా అట్లీ దీని గురించి మాట్లాడుతూ.. అద్భుతమైన అవుట్‌పుట్ కోసం నిద్ర లేని రాత్రులు గడుపుతున్నట్లు చెప్పారు. అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.




## బోర్డర్-3ని అనౌన్స్ చేసిన టీ సీరిస్

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును అందుకుంది. అయితే ఈ సినిమా సాధించిన భారీ విజయాన్ని పురస్కరించుకుని తాజాగా చిత్ర నిర్మాతలు 'బోర్డర్ 3' గురించి అధికారిక ప్రకటన చేశారు. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ మరియు జేపీ ఫిల్మ్స్ నుంచి నిధి దత్తా కలిసి ఈ ఐకానిక్ ఫ్రాంచైజీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేతులు కలిపారు. ప్రస్తుతం థియేటర్లలో సన్నీడియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ వంటి స్టార్లతో అలరిస్తున్న 'బోర్డర్ 2' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ ఓపెనింగ్ వీకెండ్ సక్సెస్ ఇచ్చిన ధీమాతోనే 'బోర్డర్ 3' ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ఈ మూడవ భాగంలో కూడా సన్నీ డియోల్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని సమాచారం ఉండగా.. మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ అదే దేశభక్తిని వెండితెరపై ఆవిష్కరించి, ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందుతున్నామని, అందుకే ఈ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని 'బోర్డర్ 3'తో కొనసాగిస్తున్నామని నిర్మాతలు సగర్వంగా ప్రకటించారు.




## సెట్‌లో మమ్ముట్టికి సన్మానం

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్లుగా సినిమా రంగంలో అతడు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ శుభసందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం మమ్ముట్టిని ఘనంగా సన్మానించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను ఆయనకు ప్రకటించడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. లెజెండరీ దర్శకుడు అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెట్స్‌లో యూనిట్ సభ్యులందరూ కలిసి మమ్ముట్టిని సత్కరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మమ్ముట్టి మరియు అదూర్ గోపాలకృష్ణన్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటం, అదే సమయంలో ఈ గౌరవం దక్కడం విశేషం. గతంలో 1998లో పద్మశ్రీ, 2022లో కేరళ ప్రభ పురస్కారాలు అందుకున్న మమ్ముట్టి ఇప్పుడు పద్మభూషణ్ గ్రహీతగా నిలిచారు.




## సుహాస్ మరో కామెడీ మూవీ హే భగవాన్

'కలర్ ఫోటో', 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుహాస్, ఇప్పుడు 'హే భగవాన్'తో మరోసారి నవ్వించడానికి సిద్ధమయ్యారు. గోపి అచంట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'రైటర్ పద్మభూషణ్' ఫేమ్ షణ్ముఖ ప్రశాంత్ కథను అందించగా, వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తండ్రీకొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో పాటు ఆద్యంతం వినోదాన్ని పంచే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది. ఒక రహస్యమైన 'ఫ్యామిలీ బిజినెస్' చుట్టూ తిరిగే ఈ కథలో ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే ఆసక్తికర నిబంధనతో సాగే తండ్రీకొడుకుల ప్రయాణం హిలేరియస్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' తర్వాత సుహాస్ మరియు శివాని నాగరం ఈ చిత్రంతో మరోసారి జంటగా నటిస్తున్నారు. ఎలాగైనా నాన్న బిజినెస్‌ను తాను టేకప్ చేయాలని తాపత్రయ పడే పాత్రలో సుహాస్ నవ్వులు పూయిస్తున్నారు. 'ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ..' అనే డైలాగులతో పాటు శివాని నాగరం జోక్స్ ఆకట్టుకుంటున్నాయి.

## పెళ్లి చూపుల నుంచి నేటి వరకు ఒత్తిడి తట్టుకుంటూనే ఉన్నా: తరుణ్ భాస్కర్

తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలతో అలరిస్తున్నవారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. తన ప్రత్యేక కథా శైలి, వినూత్న ప్రయత్నాలతో ఆయనను 'స్టోరీ మేకర్'గా గుర్తిస్తారు. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 30న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మీడియాతో తన ప్రయాణాన్ని పంచుకున్నారు. తరుణ్ తన కెరీర్ మొదటి సినిమాగా వచ్చిన 'పెళ్లి చూపులు' విజయాన్ని గుర్తు చేసుకుంటూ, 'ఆ విజయం నా కోసం ఎక్కువ ఒత్తిడిని తెచ్చింది' అని చెప్పారు. ఆ సమయంలో ఆయనకు ఎదురైన భయాలు, ఆందోళనలు, విజయంతో పాటు వచ్చిన బాధ్యతలన్నీ మామూలు అనుభవం కాదని అన్నారు. సినిమా రిలీజ్ సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైందని స్పష్టం చేశాడు. విజయాన్ని సులభంగా స్వీకరించడం, అపజయాన్ని అధిగమించడం నిజమైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఈషా రెబ్బ నటించగా,



యూత్ ఫుల్ ఎలిమెంట్స్, హ్యూమర్, సెంటిమెంట్ అన్నీ తగినంత మేళవించబడ్డాయని తెలిసింది. తరుణ్ తన ప్రత్యేకమైన శైలిలో కథను రాసి, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. కేవలం దర్శకుడిగా కాకుండా, నటుడిగా కూడా తన మార్క్ సినిమాలను కొనసాగిస్తూ, ప్రతి సినిమాతో లోకల్ కల్చర్ ను విశేషంగా ప్రతిబింబించాలనుకుంటున్నారని ఆయన చెప్పినారు. తరుణ్ భాస్కర్ ఈ ప్రయాణంలో ఒక బలమైన పాఠాన్ని అందించారు. విజయం వచ్చినా, విఫలం అయినా, దానిని తట్టుకోవడమే నిజమైన గెలుపు. 'పెళ్లి చూపులు' నాటి ఆందోళనల నుండి నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' వరకు ఆయన నిరంతర కృషి, క్రియేటివిటీ, ధైర్యం యువ దర్శకులకు మార్గదర్శకం. జనవరి 30న విడుదలయ్యే ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.